క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి కృషి చేయండి



నూతన కమిటీ సభ్యులతో ఈఓ రామకృష్ణ

పాణ్యం: కొత్తూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయాభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని ఈఓ రామకృష్ణ సూచించారు. గురువారం ఆలయ జీర్ణోద్ధరణ కమిటీ ఎన్నిక సందర్భంగా ఆయన సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో.903 ద్వారా కొత్తూరు నూతన కమిటీని ప్రకటించిందన్నారు. కమిటీ చైర్మన్‌గా మిలటరీ సుబ్బారెడ్డితోపాటు సభ్యులుగా నాగపుల్లయ్య, రాజేశ్వరమ్మ, సుబ్బారెడ్డి, పెద్దసుబ్బరాయుడు, రామసుబ్బయ్య, పుల్లయ్య, మద్దిలేటి, దిబ్బ నరసింహులు ఎంపికయ్యారన్నారు. సభ్యులు ఆలయాభివృద్ధికి అన్నివిధాలుగా సహకరించాలని కోరారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లెలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీలు గురువారం ముగిశాయి. మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో పాణ్యం టీమ్, తమ్మరాజుపల్లె టీమ్, తొగర్చేడు గ్రామ టీమ్ నిలిచాయి. ఈ జట్లు వరుసగా రూ. 10,016, రూ. 6,016, రూ. 4,016 చొప్పున నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి.

ఎస్సీ కుల గణన సర్వే జాబితా ప్రదర్శన

సి.బెళగల్: గ్రామ సచివాలయాల నోటీస్ బోర్డులో ఎస్సీ కులగణన సర్వే జాబితాను ప్రదర్శించారు. పోలకల్ – 2 గ్రామ సచివాలయంలో వీఆర్వో రఫీ, పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి సచివాలయ ఉద్యోగులతో కలిసి వివరాలను నోటీస్ బోర్డులో ఉంచారు.

28న రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలు

కర్నూలు (టౌన్): గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ త్రోబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటున్న క్రీడాకారులు తమ వెంట నాలుగు సెట్ల ఎలిజిబిలిటీ ఫార్మ్, మార్కుల మెమో, ఆధార్ జిరాక్స్, బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకురావాలని సూచించారు.

వికసిత్ భారత్ పోటీలకు ఎంపిక

కర్నూలు న్యూసిటీ: నేషనల్ యూత్ ఫెస్టివల్–2025 ను పురస్కరించుకుని ఎన్.ఎస్.ఎస్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్ డైలాగ్ అనే అంశంపై నిర్వహించిన ఫేజ్–2 వ్యాసరచన పోటీల్లో డాక్టర్ అబ్దుల్‌హక్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన ముల్లా జాస్మిన్ జహాన్ ప్రతిభ కనబరచి ఫేజ్ –3 పోటీలకు ఎంపికైంది. ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించిన ఫేజ్ –2 వ్యాసరచన పోటీల్లో మహిళా సాధికారత, దాని సామాజిక సూచికలు అనే అంశంపై ఆమె తన వ్యాసాన్ని సమర్పించింది. ఈ దశలో రాష్ట్ర వ్యాప్తంగా 250 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో 25 మంది విద్యార్థులను ఉన్నత విద్యామండలి ఫేజ్ –3 దశకు ఎంపిక చేసింది. ఈ నెల 30వ తేదీన గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో జరిగే ఫేజ్–3 పోటిల్లో మహిళా సాధికారత, సామాజిక సూచికలు అనే అంశంపై ప్రదర్శించనుంది.

ఆటల పోటీలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

కర్నూలు(రూరల్): మడల పరిధిలో పంచలింగాల, బి.తాండ్రపాడు గ్రామాలలో కిస్మస్ సందర్భంగా గురువారం నిర్వహించిన ఆటల పోటీలను ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. డ్యాన్స్, పాటల పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అదేవిధంగా యువత వాలీబాల్, కబడ్డీ పోటీల్లో హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు ఎంపీ, ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచలింగాల, బి.తాండ్రపాడు గ్రామాల సర్పంచ్‌లు మాధవి, జయన్న, ఎంపీటీసీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పంటలపై పందుల దాడి!



పూడూరు: అడవి పందులు మొక్కజొన్న పంటను ధ్వంసం చేయడంతో పశువులకు వదిలేసిన దృశ్యం



గడివేముల: ఊర పందులు దాడిలో దెబ్బతిన్న మొక్కజొన్నపైరు పంటను నాశనం చేసిన

వర్షాభావ పరిస్థితులు అన్నదాతను వెంటాడుతుండగా అడవి పందులు సైతం రైతులను దెబ్బతీస్తున్నాయి. కర్నూలు మండల పరిధిలోని పూడూరు గ్రామ పొలాలు అటవీ సమీపాన ఉండడంతో రైతులు నష్టపోతూనే ఉన్నారు. పూడూరు గ్రామానికి చెందిన రైతు బోయ గోపాల్ సాగు చేసిన మొక్కజొన్నను బుధవారం రాత్రి అడవి పందులు నాశనం చేశాయి. అటవి సమీపాన ఈ పొలం ఉండడంతో పందుల గుంపు మొక్కజొన్న పంటను ధ్వంసం చేశాయి. దీంతో చేసేదీమీలేక ఆ రైతు మొక్కజొన్నను పశువులకు మేతగా వదిలేశాడు. ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి కాపాడుకున్న పంటను పందులు ధ్వంసం చేశాయని రైతు గోపాల్ ఆందోళన వ్యక్తం చేశాడు. పెట్టుబడి ఖర్చులు రూ. 50 వేలు అయ్యిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని బాధిత రైతు కోరారు. – కర్నూలు(రూరల్)

పంటలపై ఊర పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రం గడివేముల సమీపంలో ఉన్న పంటలపై పందులు దాడులు చేస్తూ రైతులకు హడలెత్తిస్తున్నాయి. గ్రామానికి చెందిన చాంద్ బాషా గ్రామ సమీపంలో 6 ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న, మినుములు సాగు చేశాడు. గ్రామ సమీపంలో పొలం ఉండడంతో పందులు తొక్కిసలాడి పంటలను పూర్తిగా నాశనం చేశాయి. పందుల బారి నుంచి పంటలను రక్షించుకునేందుకు రైతులు అగచాట్లకు గురవుతున్నారు. పందుల యాజమానులకు పలుమార్లు సమస్యను వివరించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పందుల యాజమానులతో మాట్లాడి పంటలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. – గడివేముల

పెంచిన విద్యుత్ చార్జీలపై నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

- ఎస్‌ఈ కార్యాలయం వరకు భారీ ర్యాలీ
- వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపు

కల్లూరు: కూటమి సర్కార్ పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాట నిర్వహిస్తుందని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక స్వగృహంలోని తన కార్యాలయం నుంచి బళ్లారి చౌరస్తా మీదుగా విద్యుత్ ఎస్ఈ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా కరెంట్ చార్జీలు ఏ మాత్రం పెంచనంటూ ప్రజలన మభ్యపెట్టి గద్దెనెక్కిన సీఎం చంద్రబాబు తీరును నిరసిస్తూ ప్రజల పక్షాన చేపట్టిన వైఎస్సార్‌సీపీ పోరుబాటకు పార్టీ శ్రేణులతోపాటు అభిమానులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కేవలం ఆరు నెలలో రూ.15వేల కోట్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోపుతున్న కూటమి సర్కార్ తీరును ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు.

నేడు కోడుమూరులో ర్యాలీ...

కోడుమూరు రూరల్ : కరెంట్ చార్జీలను పెంచి ప్రజలపై బాదుడు చేపట్టిన కూటమి ప్రభుత్వం తీరుపై శుక్రవారం కోడుమూరులో వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న పోరు బాటను జయప్రదం చేయాలని కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ప్రజలకు పిలుపునిచ్చారు. విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కోడుమూరులోని కోట్ల సర్కిల్ నుంచి ట్రాన్స్‌కో కార్యాలయం వరకు నిర్వహించే భారీ ర్యాలీ చేపడుతున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులతోపాటు అభిమానులు, ప్రజలు తరలివచ్చిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు ప్రజలపై ఎలాంటి భారం మోపమని ఉపన్యాసలిచ్చి అధికారంలోకొచ్చిన సీఎం చంద్రబాబు తన మోసకారి నైజాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ నిలదీయాలన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం





సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్యాణి, దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ శ్రావణి తెలిపారు. మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో తహసీల్దార్ విద్యాసాగర్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ట్రైనీ కలెక్టర్ హాజరయ్యారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ భూ సమస్యలపై వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి వినతిని నిర్దీత గడువులోపు పరిష్కారం చూపుతామన్నారు. వివిధ సమస్యలపై మొత్తం 33 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణవేణమ్మ, కాల్వబుగ్గ ఈఓ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కొణిదేడులో రెవెన్యూ సదస్సు

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామంలో గురువారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కొన్నేళ్లుగా పొలాలకు వెళ్తున్న రస్తాపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని గ్రామ రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 70 ఎకరాల సాగుకు సంబంధించి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, విచారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే శ్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో గురువారం డిప్యూటీ తహసీల్దార్ శివరామ్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తహీనతతో అనారోగ్యం

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత వల్ల గర్భిణుల్లో పలు ఆరోగ్య సమస్యలు వస్తాయని శరీన్‌నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఫర్హీన్ తబస్సుమ్ చెప్పారు. గురువారం శరీన్‌నగర్ యూపీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు ఆమె రక్తహీనతపై అవగాహన కల్పించారు. రక్తహీనత కారణంగా నీరసం, నెలసరి సమయంలో హెచ్చు తగ్గులు, గర్భం ధరించలేకపోవడం, గర్భం వచ్చినా నిలబడకపోవడం, ప్రసూతి మరణాలు పెరిగిపోవడం వంటి సమస్యలు వస్తాయని చెప్పారు. ఈ కేంద్రంలో ప్రతి గురువారం గర్భిణులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్త్రీ వ్యాధి నిపుణులు స్కానింగ్ చేస్తారన్నారు. మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించాలంటే ఐరన్ అధికంగా ఉన్న ఆకుకూరలు, పండ్లు, ఖర్జూరాలు, దానిమ్మ, చిక్కుడు కాయలు లాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని, ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడాలని, జంక్‌ఫుడ్స్, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

పంట నూర్పిడి పనులను వాయిదా వేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్.

కోడుమూరు రూరల్: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి, కంది సాగు చేసిన రైతులు పంట నూర్పిడి పనులను ఒకటిరెండు రోజులు వాయిదా వేసుకోవాలని ఏఓ రవిప్రకాష్ సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో గురువారం ఏఓ రవిప్రకాష్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున వేరుశనగ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేరుశనగలో పచ్చపురుగు, లద్దెపురుగు ఉంటే ఎకరాకు 100గ్రాముల ఇమామిక్టన్ బెంజోయేట్ లేదా 60ఎంఎల్ క్లోరాంతరనుల్ పిచికారీ చేసుకోవాలన్నారు. రబీ కింద సాగు చేసిన పంటలకు రైతులు తప్పనసరిగా పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కందుల కొనుగోలు



మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది దిగుబడులను ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని ఏఓ మల్లేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించిన ఏఓ సాగు మెలకువలు సూచించారు. అదేవిధంగా మొక్కజొన్న పైరును పరిశీలించిన ఏఓ కత్తెర పురుగును గుర్తించారు. కత్తెరపురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందువు, ఎంపీఈఓ సోమేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు, మీదివేముల గ్రామాలలో గురువారం ఏఓ సుధాకర్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. శనగ, వేరశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. మొక్కజొన్న పంటను ఆశించిన కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సి చర్యలను ఏఓ రైతులకు వివరించారు.

కూటమి ప్రభుత్వం హామీల అమలులో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల శేఖర్

కోడుమూరు రూరల్ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ విమర్శించారు. గురువారం కోడుమూరులో సీపీఐ శత జయంతి ఉత్సవాలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి 6నెలలు గడిచినా ఇంత వరకు పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేకపోయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలపై కరెంట్ చార్జీల భారాన్ని మోపడం సమంజసం కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై భవిష్యత్ ప్రజలతో కలిసి ఉద్యమించేందుకు సీపీఐ సిద్ధమవుతోందన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణ, మండల కార్యదర్శి రాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషఫణి, నాయకులు భాస్కర్, రంగస్వామి, సులోచనమ్మ, అల్తాఫ్, మద్దిలేటి, మధు, మాధవస్వామి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ

ఓర్వకల్లు: పేదలకు సీపీఐ అండగా నిలుస్తోందని, వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వాలపై పోరాడుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. మండల కేంద్రం ఓర్వకల్లు కార్యాలయంలో సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల సహాయ కార్యదర్శి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వందేళ్లుగా ప్రజల పక్షాన పోరాటాలు చేసిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. సమావేశంలో నాయకులు ఏసేపు, బాబు, సంజీవ, మునిస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్ఞాన సముపార్జనతో జీవన్ముక్తి



మాట్లాడుతున్న రాధా మనోహర్ దాస్, పాల్గొన్న భక్తులు

కర్నూలు న్యూసిటీ: జ్ఞాన సముపార్జనతో జీవన్ముక్తి కలుగుతుందని అదే నిజమైన ఆనందమని ధర్మ ప్రచారకులు రాధామోహన్ దాస్ స్వామి భక్తులకు ఉపదేశించారు. ధనుర్మాసం సందర్భంగా నగర శివారులోని గోదా గోకులంలో జరుగుతున్న ధార్మిక కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని ప్రసంగించారు. గోదా అంటే సకల సంపదలను ప్రసాదించే తల్లి అన్నారు. నియమ నిష్టలతో భగవంతుడిని సేవిస్తే సకల సంపదలు మన వశమవుతాయని, ఇందుకు గోదాదేవి తన భక్తి మార్గం ద్వారా మనకు నిదర్శనంగా నిలిచిందన్నారు. ద్రవిడ వేదంగా విరాజిల్లుతున్న తిరుప్పావై పాశురాల పారాయణం అనంత పుణ్యమని మధుర భక్తికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో గోదాగోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజుగుప్త, చైర్మన్ పల్లెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ సందర్భంగా ఆటల పోటీలు



ఆటో రివర్స్ నడిపే పోటీ జరుగుతున్న దృశ్యం

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లోని వివిధ చర్చిలలో సంఘ కాపరులు, పెద్దల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. బస్తిపాడు గ్రామంలో ఆటోల రివర్స్ పందెం, కబడ్డీ, తాడాట, స్లో బైక్‌రేస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

పండ్ల మొక్కలను సంరక్షించుకోవాలి



ముడుమలగుర్తిలో సాగు చేసిన పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

కోడుమూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద సాగు చేసిన పండ్లు, పూల మొక్కలను రైతులు చక్కగా సంరక్షించుకోవాలని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. గురువారం మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రైతులు సాగు చేసిన పండ్లు, పూల తోటలను ఏపీఓ మోదీన్‌బాషా, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రత్నంతో కలిసి ఏపీడీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకుంటేనే ఉపాధి పథకం కింద మెయింటనెన్స్ నిధులు మంజూరవుతాయన్నారు. అలాగే ఉపాధి కూలీల సంఖ్యను పెంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఏపీడీ సిబ్బందికి సూచించారు.

నర్సింగ్ విద్యార్థినుల ప్రతిభ

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్, విజయవాడ వారు 2023–2024వ వార్షిక సంవత్సర బీఎస్సీ నర్సింగ్ కోర్సు పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇందులో కర్నూలు నగర శివారులోని కళాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (కిమ్స్) నర్సింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఫలితాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు వరుసగా 20 డిస్టింక్షన్లు, 45 ఫస్ట్‌క్లాస్‌లు, 10 మంది సెండ్ క్లాస్‌లలో ఉత్తీర్ణులైనట్లు కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల యావరేజ్ ఉత్తీర్ణత 80 శాతం ఉందని, కాలేజీ టాపర్లుగా ఎస్.వర్ష, సి.నవీన్‌కుమార్, ఎమ్.రవితేజ, ఇందుశ్రీగా నిలిచారన్నారు.